

అక్షరశక్తి

The Power of Pen

Evening Daily

సంపుటి: 20 | సంచిక: 324 | వరంగల్ | శుక్రవారం, 02 అక్టోబర్ 2026 | పేజీలు: 07

- ఉద్యమానికి కరదీపికనైన నేను.. అధికారంలో భాగస్వామ్యానికి పనికిరానా?
- మ్యాజిక్ షోలే నాలో బిడియాన్ని పోగొట్టి ప్రజాక్షేత్రంలో నిలబెట్టాయి
- కోర్టులో నాడు కుల వివక్షను ఎదిరించా.. న్యాయవాదిగా పేదల పక్షాన నిలిచా..
- కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు ఉద్యమ కేసులను పైసా తీసుకోకుండా వాదించా
- పార్టీ ఆవిర్భావ దినాన టీఆర్ఎస్‌లో చేరిన మొట్టమొదటి న్యాయవాదిని నేనే..
- నా నాయకత్వ పటిమను చూసి ఓర్వలేక.. కుట్రలతో నన్ను అధికారానికి దూరం చేశారు
- 9ఏళ్ల పాలనలో నాకు దక్కింది శూన్యం.. నమ్ముకున్న ఉద్యమకారులకు ద్రోహం
- వరంగల్ జిల్లా చారిత్రక అస్తిత్వాన్ని, పోరాట పటిమను దెబ్బతీశారు
- ఓదార్పు యాత్రలో తెలిసిన చేదు నిజం.. ఉద్యమకారుల కుటుంబాల్లో ఏమాత్రం సంతోషం లేదు!
- తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక రాష్ట్ర చైర్మన్, ప్రముఖ న్యాయవాది గుడిమళ్ల రవికుమార్
- తెలంగాణ డిజిటల్ మీడియా ప్రతినిధులతో చిట్-చాట్

తలొంచి కాదు.. ఎదిరించి బతికిన!



"తలొంచుకొని బతకలేదు.. ఎదురించి బతికిన. నిరంతర సంఘర్షణ నుంచి వచ్చినవాడిని. నా ఆత్మగౌరవాన్ని ఎప్పుడూ తాకట్టు పెట్టలేదు. ఆత్మాభిమానాన్ని చంపుకొని అవకాశాల కోసం పాకులాడలేదు. అణిచివేతలను, అసమానతలను ధైర్యంగా ఎదిరించి ప్రశ్నించడం వల్లే సమాజంలో ప్రజా నాయకుడిగా గుర్తింపు పొందాను. ఉద్యమానికి కరదీపికలా పనికొచ్చిన నాలాంటి వాళ్లం.. స్వరాష్ట్రం సిద్ధించాక అధికారంలో భాగస్వామ్యానికి పనికిరాలేదా? తొమ్మిదేళ్ల పాలనలో ఉద్యమకారుల బతుకులు అంధకారమయ్యాయి. అందుకే మలిదశ ఉద్యమానికి నడుం బిగించాం" అని స్పష్టం చేశారు ప్రముఖ న్యాయవాది, తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక రాష్ట్ర చైర్మన్ గుడిమళ్ల రవికుమార్. తెలంగాణ డిజిటల్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన ప్రత్యేక చిట్-చాట్‌లో ఆయన తన బాల్యం, విద్యార్థి దశ, న్యాయవాద ప్రస్థానం, ఉద్యమ అనుభవాలు మరియు సమకాలీన రాజకీయాలపై మనసు విప్పి మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

- అక్షరశక్తి, వరంగల్ ప్రతినిధి

SPECIAL PAGE

ప్రజా రవాణాలో డిజిటల్ దూకుడు!

ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్ ప్రారంభం

- 'మీటికెట్' యాప్‌తో ఇక మొబైల్‌లోనే బస్ టికెట్
- 12 ఏళ్ల తర్వాత ఆటో చార్జీల సవరణ
- హైదరాబాద్ అభివృద్ధికి రూ.52 వేల కోట్ల పనులు

4







జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

- టీడీఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెల్లి కిరణ్ కుమార్
- డిజిటల్ మీడియా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి
- టీడీఎంయూ రాష్ట్ర కార్యదర్శి పల్లెబోయిన నాగరాజు

5

దసరాకు అమ్మవారి రథం ప్రారంభం

- తుదిమెరుగులు దిద్దుతున్న కళాకారులు
- మాడవీధుల నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే---



3

ఘనంగా లయన్స్ క్లబ్ గాంధీ జయంతి



అక్షరశక్తి, మహబూబాబాద్: మానుకోట లయన్స్ భవన్‌లో శుక్రవారం మహాత్మాగాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కొండపల్లి కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ సత్యం, అహింస మార్గాలను అనుసరించి గాంధీజీ స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించారని అన్నారు. 'సత్యమే జయతే' సిద్ధాంతంతో ప్రజలకు ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. గాంధీజీ చూపిన సత్యం, అహింస, స్వచ్ఛత, సేవా మార్గాలను జీవితంలో ఆచరించడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పారుపల్లి రమేష్‌బాబు, సీనియర్ సభ్యులు భవిరి శెట్టి నాగేశ్వరరావు, రావుల రవిచందర్‌రెడ్డి, డాక్టర్ వీరన్న, సాదుల సురేష్‌బాబు, మాలే కాళీనాథ్, పరకాల రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూపాలపల్లిలో ఈ నెల 9న మెగా జాబ్‌మేళా



అక్షరశక్తి, భూపాలపల్లి: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆధ్వర్యంలో ఈ నెల 9న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నారు. భూపాలపల్లిలోని పుష్ప గ్రాండ్‌లో జరిగే జాబ్‌మేళాలో 300కు పైగా కంపెనీలు పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు. సుమారు 20 వేల మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులకు ప్రాంగణంలోనే ప్రత్యక్ష ఇంటర్వ్యూలు నిర్వహించి, ఎంపికైన వారికి అక్కడికక్కడే నియామక పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగ యువత కోసం ఉచిత రవాణా, భోజన సదుపాయాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గాంధీ ఆశయాలు ఆదర్శప్రాయం



అక్షరశక్తి, భూపాలపల్లి: గాంధీజీ ఆశయాలు నేటి సమాజానికి ఆదర్శప్రాయమని భూపాలపల్లి జిల్లా అదనపు ఎస్పీ నరేష్‌కుమార్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యం, అహింస, శాంతి, సహనం, ఐక్యత వంటి గాంధీజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని సూచించారు. సమాజంలో శాంతి, సామరస్యం, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా పోలీసు అధికారులు, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ రత్నం, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏసీపీని కలిసిన శ్రీనివాసాచారి



అక్షరశక్తి, వరంగల్ : తెలుగు భాషా పండిత సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు, రచయిత సిద్దోజు శ్రీనివాసచారి శుక్రవారం మామునూరు ఏ.సి.పి. నర్సింగోజు వెంకటేష్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల ఆదివారం హనుమకొండలో శ్రీ శాంతి కృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో కాకతీయ కళా వైభవం పేరుతో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గిన్నిస్ వరల్డ్ రికార్డు గ్రహీత శ్రీ శాంతి కృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మామునూరు ఏ.సి.పి. వెంకటేష్ అవార్డు అందుకున్న సందర్భంగా శ్రీనివాసాచారి కలిసి అభినందనలు తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి



అక్షరశక్తి, హన్మకొండ : జర్నలిస్టుల హక్కులు, భద్రత, సంక్షేమానికి సంబంధించిన దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్, హనుమకొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం డిమాండ్ల దినోత్సవం నిర్వహించారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని పబ్లిక్ గార్డెన్‌లోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి జర్నలిస్టులు నిరసన తెలిపారు. బ్యానర్ పట్టుకుని సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేస్తూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మహాత్మా గాంధీ విగ్రహానికి పూలదండలు వేసి పూలు సమర్పించి నివాళులర్పించారు. జర్నలిస్టుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయికి అందజేశారు. అలాగే వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజులను కలిసి సమస్యలను వివరించి వినతిపత్రాలు అందజేశారు.

కొత్త మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి

దేశంలో మారుతున్న మీడియా రంగ పరిస్థితులను సమగ్రంగా సమీక్షించి విధానపరమైన సిఫార్సులు చేసేందుకు కొత్త మీడియా కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. జర్నలిస్టులు, మీడియా సిబ్బంది, వార్తా సంస్థల భద్రతకు ప్రత్యేక కేంద్ర చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. కొత్త కార్మిక చట్టాల్లో విలీనమైన 1955, 1958 నాటి వర్కింగ్ జర్నలిస్టుల ప్రత్యేక చట్టాల ద్వారా గతంలో కల్పించిన హక్కులు, ఉద్యోగ భద్రత, పని గంటలు, వివాద పరిష్కార విధానాలు, సేవల విరమణకు సంబంధించిన రక్షణలను పునరుద్ధరించాలని కోరారు. ప్రింట్, ప్రసార, డిజిటల్ మీడియా ఉద్యోగులకు వర్తించేలా కొత్త వేతన బోర్డును వెంటనే ఏర్పాటు చేసి ద్రవ్యోల్బణానికి అనుగుణంగా వేతనాలను సిఫార్సు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జర్నలిస్టులకు వైద్య సదుపాయాలను వెంటనే పునరుద్ధరించాలని కోరారు. స్వేచ్ఛాయుతమైన, ఆర్థికంగా భద్రమైన మీడియా వ్యవస్థ ప్రజాస్వామ్యానికి ఎంతో అవసరమని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రభుత్వం త్వరగా పరిష్కరించాలని కోరారు.

కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గడ్డం కేశవమూర్తి, ఊటుకూరు సీతారామారావు (సాయిరామ్), రాష్ట్ర హౌసింగ్ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ వల్లాల వెంకటరమణ, నేషనల్ కౌన్సిల్ సభ్యులు పీవీ మదన్‌మోహన్, గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంకణాల సంతోష్, ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారపు సదయ్య, జిల్లా కోశాధికారి పోలిశెట్టి విష్ణువర్ధన్, ప్రెస్ క్లబ్ కోశాధికారి బోలా అమర్, జిల్లా కార్యవర్గ ప్రతినిధులు విజయ్ భాస్కర్, గన్ను సంతోష్ కుమార్, రామారావు, ఉస్మాన్ పాషా, వాజీద్, దండు మోహన్, కొమ్మాలు భిక్షపతి, యాదవ్, విజయ్ భాస్కర్, నయీమ్ పాషా, చుక్కా రావు, ముదిగిరి ఓదెలు, నల్లాల బుచ్చిరెడ్డి, ప్రమోద్, అల్లే రామారావు, ప్రదీప్, బి. శ్రీహరి రాజు తదితర నాయకులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహం సాక్షిగా జర్నలిస్టుల గళం



అక్షరశక్తి, వరంగల్, అక్టోబర్ 2: గాంధీ జయంతి రోజున పాత్రికేయులు తమ గోడును జాతిపిత ముందు ఉంచారు. టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జాతీయ కమిటీ ఆదేశం, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం గ్రేటర్ వరంగల్ కార్యాలయం ఎదుట ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ రోజును "పనిచేస్తున్న పాత్రికేయుల డిమాండ్ దినం"గా పాటించాలన్న జాతీయ కమిటీ తీర్మానంలో భాగంగా, జిల్లా కమిటీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించింది. జాతీయ కౌన్సిల్ సభ్యుడు సంగోజు రవి మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా సౌకర్యాలు కల్పించాలని, ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఇండ్లు, ఇంటి స్థలాల సమస్యను తక్షణమే తేల్చాలన్నారు. వరంగల్ తూర్పులో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం పూర్తయినా పంపిణీ చేయకుండా ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్ రాంచందర్ మాట్లాడుతూ, పాత్రికేయుల కష్టాలను తొలగించేందుకు జాతీయ, రాష్ట్ర నాయకుల అడుగుజాడల్లో జిల్లా కమిటీలు ముందుకు సాగుతున్నాయని చెప్పారు. వరంగల్ జిల్లాలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కలం యోధులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అందుకే సమస్యలను లిఖితపూర్వకంగా గాంధీజీకి విన్నవించామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సత్వరమే స్పందించి అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మట్టా దుర్గాప్రసాద్, కోశాధికారి కొదాటి గోపాలకృష్ణ, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు కందుల శ్రీధర్, ఉపాధ్యక్షులు జన్ను స్వామి, కూర్ణ వెంకటేశ్వర్లు, మహాదేవుని జగదీష్, సహాయ కార్యదర్శులు బొమ్మగాని సతీష్, చింతనూరి రాజు, బాధవత్ బాలాజీ, కార్యవర్గ సభ్యులు హుస్సేన్ పాషా, అక్రమ్, బాబర్, దేసు లక్ష్మణ్, కందుల శ్రీనివాస్, గాదె రవి, శీలం రమేష్, సీనియర్ పాత్రికేయులు పెరుమాండ్ల మధు, ఎండీ సయీద్, సామల సూర్యప్రకాష్, పలిశెట్టి సుధాకర్, ఎలుగందుల అజయ్ చిన్నబాబు, చైతన్య సాజిద్ పాషా, నితీష్, అమీర్, చిట్టిబాబు, మురళి, రాజేందర్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహబూబాబాద్ రైల్వే స్టేషన్ సమస్యలు పరిష్కరించాలి

దక్షిణ మధ్య రైల్వే జీఎంకు టీపీ జేఏసీ వినతి



అక్షరశక్తి, మహబూబాబాద్: మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీపీ జేఏసీ (తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ) ఆధ్వర్యంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవత్సవకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. రైల్వే జీఎం స్టేషన్‌ను సందర్శించిన సందర్భంగా టీపీ జేఏసీ నాయకులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారంపై జీఎం సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌లో 4వ నంబర్ ప్లాట్‌ఫామ్ నిర్మించాలని, మెగా ఫ్రైట్ మెయింటెనెన్స్ పీఓహెచ్/ఆర్ఓహెచ్ పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. నిర్మాణంలో ఉన్న ఎస్కలేటర్ల పనులను పూర్తి చేసి ప్రయాణికుల వినియోగంలోకి తీసుకురావాలని, కోర్టు వైపు రెండో ప్రవేశ ద్వారం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. మహబూబాబాద్‌లో వందే భారత్, గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు. మహబూబాబాద్ నుంచి ఢిల్లీకి నేరుగా రైలు సౌకర్యం లేనందున, మహబూబాబాద్ మీదుగా ఢిల్లీ వెళ్లే రైళ్లకు ఇక్కడ హాల్టింగ్ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. 2, 3వ ప్లాట్‌ఫామ్‌లపై ప్రయాణికుల సౌకర్యార్థం కవర్ షెడ్లు నిర్మించాలని, స్టేషన్ ఆవరణలోని వెహికల్ స్టాండ్‌లో పార్కింగ్ రుసుము చెల్లించే వాహనదారులకు తప్పనిసరిగా రసీదులు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా రైల్వే మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు మరిన్ని రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలని టీపీ జేఏసీ నాయకులు కోరారు. కార్యక్రమంలో టీపీ జేఏసీ మహబూబాబాద్ జిల్లా కన్వీనర్ మామిడాల సత్యనారాయణ, రాష్ట్ర కోకన్వీనర్ మైసా శ్రీనివాసులు, జిల్లా కోకన్వీనర్లు ఎస్కే.జానీ, బొప్పిడి శ్రీనివాస్‌రెడ్డి, హలావత్ లింగ్యా, బట్టు చైతన్య, పీడీఎస్‌యూ నాయకుడు బోసగిరి మదులు పాల్గొన్నారు.

దసరాకు అమ్మవారి రథం ప్రారంభం

- తుదిమెరుగులు దిద్దుతున్న కళాకారులు
- మాడవీధుల నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే...



అక్షరశక్తి, హనుమకొండ: దసరా పర్వదినం నాటికి భద్రకాళి అమ్మవారి రథాన్ని భక్తులకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ మేరకు రథం పూర్తి అయ్యేలా పనులను వేగవంతం చేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, అధికారులను ఆదేశించారు. భద్రకాళి ఆలయ పరిసరాల్లో కొనసాగుతున్న మాడవీధుల నిర్మాణ పనులను వారు క్షేత్రస్థాయిలో శుక్రవారం పర్యటించి పరిశీలించారు. తొలుత భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పరిసరాల్లో నిర్మాణంలో ఉన్న మాడవీధులు, అమ్మవారి రథం పనులను పరిశీలించారు.

దసరా ఉత్సవాల సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చే అవకాశం ఉన్నందున పనులను నాణ్యతా ప్రమాణాలతో, వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అమ్మవారి రథానికి సంబంధించిన పనులు తుది దశకు చేరుకున్నాయని, కళాకారులు రథానికి తుదిమెరుగులు దిద్దుతున్నారని తెలిపారు. దసరా నాటికి రథాన్ని సిద్ధం చేసి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

మాడవీధుల నిర్మాణం పూర్తయితే ఆలయానికి వచ్చే భక్తులకు మరింత సౌకర్యం కలగడంతో పాటు ఉత్సవాల నిర్వహణకు అనుకూలంగా ఉంటుందని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. భక్తుల సౌకర్యం, ఆలయ ప్రాశస్త్యాన్ని దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని కలెక్టర్,ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతి, మిగిలి ఉన్న పనులు, దసరా ఉత్సవాల నాటికి పూర్తి చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేసేందుకు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట కుడా అధికారులు అజిత్ రెడ్డి, భీమ్ రావు, ఆలయ ఈఓ సునీత తదితరులు ఉన్నారు.

107, 110 సర్వే నెంబర్లలోని ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలి

- జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పందించాలి
- లేనియెడల రాష్ట్ర రాజధాని కేంద్రంగా కార్యాచరణ చేపడతాం
- లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు రాజేష్ నాయక్



అక్షరశక్తి, మహబూబాబాద్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో పంజాల ఫంక్షన్ హాల్ లో లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్ నాయక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు రాజేష్ నాయక్ మాట్లాడారు. అతిపెద్ద గిరిజన జిల్లా అయిన మానుకోటలో వలస వాదిగా వచ్చిన ఓం నారాయణ లోయ ఈరోజు లక్షల కోట్లకు ఎదిగి మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఉన్నటువంటి సర్వేనెంబర్ 107 110 ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని నెలకు లక్షల రూపాయలు దండుకుంటున్నాడని ఆరోపించారు. ఈ జిల్లాకు ఇన్చార్జి మంత్రి అయినా రెవెన్యూ శాఖ మంత్రి అయిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెంటనే స్పందించి ఓం నారాయణ లోయ ఆక్రమించుకున్న ప్రభుత్వ భూమిని వెంటనే స్వాధీనం పరచుకోవాలని లేని యెడల ఈ ఉద్యమాన్ని తెలంగాణ రాష్ట్ర కేంద్రంగా ఉదృతం చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసు నాయక్ మాట్లాడుతూ మానుకోట జిల్లాలో ఉన్నటువంటి జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మెజిస్ట్రేట్ అయిన అధికారులు ఓం నారాయణ లోయ ఆక్రమించుకున్న భూమి ప్రభుత్వ భూములు అని తెలిసి కూడా ఎందుకు స్వాధీన పరుచుకోవడం లేదు. ఇందులో ఉన్న ఆంతర్యం ఏంటి అని ప్రశ్నించారు. 24 గంటల లోపు జిల్లా కలెక్టర్ సమాధానం చెప్పకపోతే భవిష్యత్తులో జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని వేల మందితోని కుల సంఘాలు ప్రజా సంఘాలను కలుపుకొని ముట్టడి చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా గుగులోతు భీమా నాయక్ మాట్లాడుతూ ప్రాణ త్యాగానికైనా సిద్ధమైతే కానీ ఓం నారాయణ లోయ ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూమిని ప్రభుత్వం స్వాధీన పరుచుకునే వరకు నిద్ర పోనని శపధం చేశారు. అత్యధికంగా ఉన్న గిరిజన జనాభా ఓట్లతో గద్దె నెక్కిన ఏ పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు భూ కబ్జాదారులకి సహకరిస్తున్నారని ఆరోపించారు. అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సామ్యూల్ మాట్లాడుతూ ఎల్ హెచ్ పి ఎస్ తీసుకునే ఉద్యమంలో తమ వంతుగా పోరాటం చేస్తామని మద్దతు ఇస్తామని తెలియజేశారు. గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకన్న నాయక్ మాట్లాడుతూ మానుకోట ప్రజలు కష్టపడి పండించే పంటలను ఆగువ ధరకే తీసుకొని లక్షలలో సంపాదించి ఈరోజు కోట్లలో ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నాడని ఆరోపించారు. సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు బిక్షం పాల్గొని మద్దతు ప్రకటించారు. లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్ నాయక్ మాట్లాడుతూ మహబూబాబాద్ తాసిల్దార్ ఆఫీస్ నుండి సమాచార హక్కు చట్టం కింద తీసుకున్న పోలియో పహానిలలో మహబూబాబాద్ సర్వేనెంబర్ 107 లో 195455 నుండి 202425 వరకు ఎకరం1. 34 గుంటల భూమి ప్రభుత్వ భూమి అని రికార్డులు చెబుతున్నాయని ఆరోపించారు. ఈ భూమి విషయంలో గత మూడు నెలల క్రితం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ గారిని ఆశ్రయించిన జిల్లా కలెక్టర్ మరియు మున్సిపాలిటీ కమిషనర్లకు నోటీసులు వచ్చినా కూడా స్పందించలేకపోయారు అని ఆరోపించారు. ఇకనైనా జిల్లా కలెక్టర్ స్పందించి ఈ భూమి విషయంలో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల భవిష్యత్తులో దశలవారీగా ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. వివిధ సంఘాల నాయకులు పాల్గొని భవిష్యత్తులో జరగబోయే ఉద్యమాలకు తమ వంతుగా సహకరిస్తామని మద్దతు ప్రకటిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్వర్ణలత బానోత్ వెంకన్న నాయక్ బానోత్ రాందాస్ నాయక్ బిచ్చు నాయక్ మంగీలాల్ నాయక్ సురేష్ నాయక్ అజ్మీరా బాలు నాయక్ ధరావత్ నరేష్ నాయక్ పరకాల శ్రీనివాస్ రెడ్డి బానోత్ సాయి తదితరులు పాల్గొన్నారు.

గాంధీ మార్గం సమాజానికి స్ఫూర్తిదాయకం



అక్షరశక్తి, నర్సంపేట: మహాత్మాగాంధీ చూపిన సత్యం, అహింస మార్గాలు సమాజానికి స్ఫూర్తిదాయకమని నర్సంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా నర్సంపేటలోని గాంధీ విగ్రహం వద్ద పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పంబి వంశీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాంధీజీ మతసామరస్యం, పరమత సహనానికి ప్రతీకగా నిలిచారని అన్నారు. గాంధీజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించి సమాజంలో శాంతి, సమానత్వం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ గంధం నరేందర్‌గుప్తా, నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చింతల సాంబరెడ్డి, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు ఓర్సు తిరుపతి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మ, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వేముల సాంబయ్యగౌడ్, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఎర్ర యాకుబ్‌రెడ్డి, కౌన్సిలర్లు వేముల సంధ్యసాంబయ్య, బత్తిని రాజేందర్, ముత్తినేని వెంకన్న, ఎలకంటి విజయ్‌కుమార్, మాదాసి రవి, భూక్య మత్రు రాథోడ్, సలావుద్దీన్ అయూబ్‌ఖాన్, బాణాల ప్రసన్నశ్రీనివాస్, వేల్పుల శ్రీలత, పొన్నాల మనీషాప్రకాష్, మార్కెట్ డైరెక్టర్ కొల్లూరి మధుకర్, పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బైరి మురళీ, పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ధోని కీర్తన, మాజీ వార్డు సభ్యులు గాజుల రమేష్, గండి గిరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'జై జవాన్..జై కిసాన్' స్ఫూర్తిదాయకం



అక్షరశక్తి, వరంగల్: లాల్‌బహదూర్ శాస్త్రి దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని లాల్‌బహదూర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎస్వీ రమణారెడ్డి అన్నారు. శుక్రవారం కళాశాలలో శాస్త్రి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 'జై జవాన్..జై కిసాన్' నినాదంతో దేశ ప్రజలను ఒక్కతాటిపైకి తీసుకొచ్చిన మహనీయుడని కొనియాడారు. సైన్యం, వ్యవసాయ రంగాల బలోపేతానికి ఆయన చేసిన కృషి నేటి తరానికి ఆదర్శమన్నారు. అదే సమయంలో మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని కళాశాలలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వచ్ఛ క్యాంపస్ కోసం విద్యార్థులు, సిబ్బంది పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో కెప్టెన్ డాక్టర్ ఎం.సదానందం, డాక్టర్ ఎ.రాఘవేందర్‌రెడ్డి, వి. మధుకర్‌రావు, ఎన్‌సీసీ క్యాడెట్లు హరి లోకేష్, గోకుల్, షాహిల్, రాకేష్‌నాయక్, రిషిత్, అక్షిత, కావ్య, స్వాతి, శిరీష పాల్గొన్నారు.

గాంధీ జయంతి రోజున మద్యం అమ్మకాలు

అక్షరశక్తి, హన్మకొండ క్రైం : జాతి పీత మహాత్మా గాంధీ జయంతి రోజున డ్రై డే గా దేశం మొత్తం పాటిస్తారు. అక్టోబర్ 2న యావత్ భారతదేశం మొత్తం మద్యం, మటన్, చికెన్ షాపులు సైతం అమ్మకాలపై నిషేధం ఉంటుంది.
కానీ వరంగల్ నగరంలో కొన్నిచోట్ల దొంగ చాటున లిక్కర్ అమ్మకాలు చేసేందుకు పెద్దఎత్తున మందు బాటిళ్లు తెచ్చి అమ్మకానికి ఉండడంతో సమాచారం అందుకున్న టాస్క్ ఫోర్స్ పోలీసులు చాకచక్యంగా పట్టుకొని లిక్కర్ బాటిల్ సుమారు 29వేళా ధర వుంటుందని టాస్క్ ఫోర్స్ పోలీసులు అంచనా వేశారు.



గాంధీజీ, శాస్త్రి ఆశయాలను

కొనసాగించాలి



అక్షరశక్తి, కేయూ క్యాంపస్ (వరంగల్): మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి ఆశయాలను నేటి తరం కొనసాగించాలని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం పిలుపునిచ్చారు. గాంధీ, శాస్త్రి జయంతి సందర్భంగా కేయూ పరిపాలన భవన ప్రాంగణంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇరువురి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అహింస బలహీనతకు సంకేతం కాదని, అది శక్తివంతమైన ఆయుధమని అన్నారు. కార్యక్రమంలో ఓఎస్డీ ఆచార్య బి.వెంకట్రామరెడ్డి, ఆచార్య పి.మల్లారెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల, ఆచార్య నరసింహాచారి, ఆచార్య గాదె సమ్మయ్య, డాక్టర్ ఎస్.మల్లేశ్వర్, డాక్టర్ టి.శాస్త్రి, డాక్టర్ పి.శ్రీనివాస్, పి.రవి తదితరులు పాల్గొన్నారు. పీఆర్ఓ డాక్టర్ పృథ్వీరాజ్ వల్లాల సమన్వయకర్తగా వ్యవహరించారు.

కేయూలో బి.ఫార్మసీ స్పాట్ అడ్మిషన్లు

అక్షరశక్తి, కేయూ క్యాంపస్(వరంగల్): కాకతీయ విశ్వవిద్యాలయం ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో బి.ఫార్మసీ కోర్సులో మిగిలిన 8 ఖాళీ సీట్ల భర్తీకి ఈ నెల 5న స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్, హెడ్ ప్రొఫెసర్ జె.కృష్ణవేణి తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు స్పాట్ ఫీజుతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు. అర్హత సాధించిన అభ్యర్థులు రూ.1,300, అర్హత సాధించని అభ్యర్థులు రూ.2,100 స్పాట్ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ట్యూషన్ ఫీజు రూ.45 వేలు ఉంటుందని పేర్కొన్నారు. స్పాట్ అడ్మిషన్ ద్వారా ప్రవేశం పొందిన వారికి ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ వర్తించదని స్పష్టం చేశారు.

నిజాయితీకి శాస్త్రి నిలువెత్తు నిదర్శనం

అక్షరశక్తి, కాజీపేట, అక్టోబరు 2: మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కాజీపేట రైల్వే పాలిక్లినిక్ సీనియర్ డీఎంవో డాక్టర్ హరిబాబు అన్నారు. లాల్‌బహదూర్ శాస్త్రి 122వ జయంతి సందర్భంగా తెలంగాణ రైల్వే ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో కాజీపేట ఈఎల్ఎస్ రైల్వే క్వార్టర్స్ కూడలిలోని శాస్త్రి విగ్రహం వద్ద శుక్రవారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హరిబాబు, రైల్వే కాంట్రాక్టర్ పి.సురేష్ శాస్త్రి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ హరిబాబు మాట్లాడుతూ దేశంలో ఆహార కొరత నెలకొన్న సమయంలో ప్రజలు సంయమనం పాటించాలని పిలుపునిచ్చిన శాస్త్రి, రైతులను ప్రోత్సహించారని తెలిపారు. రైల్వే కాంట్రాక్టర్ పి.సురేష్ మాట్లాడుతూ శాస్త్రి నిస్వార్థ సేవకు, నిజాయితీకి మారుపేరని అన్నారు. జేఏసీ చైర్మన్ కొండ్ర నర్సింగరావు మాట్లాడుతూ శాస్త్రి ప్రధానిగా, రైల్వే మంత్రిగా పనిచేసినప్పటికీ స్వంత ఇల్లు కూడా లేకుండా నిరాడంబరంగా జీవించారని పేర్కొన్నారు. కార్యక్రమానికి తెలంగాణ రైల్వే ఎంప్లాయిస్ జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్ అధ్యక్షత వహించారు. ఎస్సీ రైల్వే సికింద్రాబాద్ డివిజనల్ ఓబీసీ కార్యదర్శి అనుముల సంతోష్, రిటైర్డ్ రైల్వే ఉద్యోగులు ఎస్.ఆర్.వి.రావు, గుజ్జుపు సుధాకర్‌రావు, ఎం.కె.మూర్తి, కె.సంగమయ్య, సంఘ్ నాయకులు బి.మాధవరావు, టి.ప్రవీణ్, జేఏసీ నాయకులు వస్కుల రవీందర్, సంపత్, పి.రమేష్, డి.రవీందర్, జి.భాస్కర్, కె.సాయిరాజ్, ఎల్లాస్వామి, ఎస్.దేవిప్రసాద్, నాగరాజు, నవీన్, కరుణాకరచారి, అశోక్, భిక్షపతి, రాజన్న, టోని, మర్యాల కృష్ణ, అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజా రవాణాలో డిజిటల్ దూకుడు!

- ఆర్టీసీ–మెట్రో కామన్ పాస్ ప్రారంభం
- 'మీటికెట్' యాప్‌తో ఇక మొబైల్‌లోనే బస్ టికెట్
- 12 ఏళ్ల తర్వాత ఆటో చార్జీల సవరణ
- హైదరాబాద్ అభివృద్ధికి రూ.52 వేల కోట్ల పనులు





అక్షరశక్తి, హైదరాబాద్: తెలంగాణ ప్రజా రవాణా వ్యవస్థలో డిజిటల్ సేవలను విస్తరించే దిశగా ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్, 'మీటికెట్' మొబైల్ యాప్, డిజిటల్ పీక్లీ బస్ పాస్‌లను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. హైదరాబాద్ ప్రజా భవన్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వీటిని ప్రారంభించారు. రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రులు వివేక్ వెంకటస్వామి, మహమ్మద్ అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. కామన్ పాస్‌తో ఓఆర్ఆర్ పరిధిలో నడిచే టీజీఎస్ఆర్టీసీ సిటీ బస్సులు (పుష్పక్ మినహా), మెట్రో రైళ్లలో ప్రయాణించవచ్చు. రోజువారీ పాస్ ధర రూ.400 కాగా, ఇందులో మెట్రోకు రూ.300, ఆర్టీసీకి రూ.100గా నిర్ణయించారు. నెలవారీ పాస్ రూ.8,500 కాగా, మెట్రోకు రూ.7,000, ఆర్టీసీకి రూ.1,500గా ఉంది. కార్డు తీసుకునే సమయంలో రూ.100 డిపాజిట్ చెల్లించాలి.

'మీటికెట్'తో బస్ టికెట్లు

సిటీ బస్సు ప్రయాణికుల కోసం 'మీటికెట్' యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. మొబైల్ ద్వారా బస్ టికెట్లు, రోజువారీ, వారపు, నెలవారీ పాస్‌లు కొనుగోలు చేసుకోవచ్చు. బోర్డింగ్ పాయింట్, గమ్యస్థానం ఎంపిక చేసి ఆన్‌లైన్‌లో చెల్లింపు చేయడంతో పాటు డైనమిక్ క్యూఆర్ కోడ్‌తో డిజిటల్ టికెట్ పొందే సదుపాయం కల్పించారు. రోజువారీ ప్రయాణికుల కోసం రూ.600తో డిజిటల్ వీక్లీ బస్ పాస్‌ను కూడా ప్రవేశపెట్టారు.

12 ఏళ్ల తర్వాత ఆటో చార్జీల సవరణ

ఆటో రిక్షా చార్జీలను 12 ఏళ్ల తర్వాత ప్రభుత్వం సవరించింది. మొదటి 1.6 కిలోమీటర్లకు కనీస చార్జీ రూ.30గా, ఆ తర్వాత ప్రతి కిలోమీటర్‌కు రూ.14గా నిర్ణయించారు. నిరీక్షణ చార్జీ నిమిషానికి 75 పైసలుగా, అర్హత కలిగిన సామాను ప్యాకేజీ చార్జీ 50 పైసలుగా నిర్ణయించారు. గరిష్ఠ సామాను పరిమితిని 100 కిలోలుగా నిర్దేశించారు. రాత్రి 11 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు సాధారణ చార్జీకి 1.5 రెట్లు వసూలు చేయనున్నారు. ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆటో కార్మికుల జీవనోపాధి, సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఆర్టీసీకి ప్రస్తుతం నెలకు రూ.300 కోట్లు విడుదల చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అదనంగా మరో రూ.50 కోట్లు విడుదల చేసి మొత్తం రూ.350 కోట్లతో ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కోరారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించే మహాలక్ష్మి పథకాన్ని సమర్థంగా అమలు చేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందిని అభినందించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి హైదరాబాద్ వరకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

హైదరాబాద్‌లో రూ.52 వేల కోట్ల అభివృద్ధి పనులు

నగర అభివృద్ధిలో భాగంగా రూ.52 వేల కోట్ల విలువైన మౌలిక వసతుల పనులు కొనసాగుతున్నాయని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. రోడ్లు, ఫ్లైఓవర్లు, బ్రిడ్జిలు, అండర్‌పాస్‌లు, తాగునీటి వసతులపై పనులు చేపడుతున్నట్లు చెప్పారు. హెచ్ఎండీఏ పరిధిలో రూ.35 వేల కోట్లతో రోడ్లు, ఫ్లైఓవర్లు, బ్రిడ్జిల నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. హైదరాబాద్ మెట్రోను 122 కిలోమీటర్ల మేర విస్తరించేందుకు సుమారు రూ.38 వేల కోట్లతో ఫేజ్-2 ప్రాజెక్టు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఓల్డ్‌సిటీ, ఎయిర్‌పోర్టు, పటాన్‌చెరు, హయత్‌నగర్ ప్రాంతాలకు మెట్రో కనెక్టివిటీ కల్పించనున్నట్లు చెప్పారు.

ఆర్ఆర్ఆర్–ఓఆర్ఆర్ అనుసంధానానికి 21 రేడియల్ రోడ్లు

హైదరాబాద్ నగర అభివృద్ధిని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేలా 362 కిలోమీటర్ల రీజినల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టును చేపట్టామని భట్టి విక్రమార్క తెలిపారు. ఓఆర్ఆర్-ఆర్ఆర్ఆర్‌లను అనుసంధానం చేస్తూ 21 రేడియల్ రోడ్లను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే 10 రోడ్ల అలైన్‌మెంట్‌కు అనుమతులు ఇచ్చామని, రెండు రోడ్ల పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు.

మూసీ నది పునరుజ్జీవనానికి చర్యలు చేపట్టామని, సుమారు 55-56 కిలోమీటర్ల మేర ప్రవహించే మూసీని ప్రక్షాళన చేయనున్నట్లు చెప్పారు. వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు డీజిల్ ఆర్టీసీ బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడుతున్నామని తెలిపారు. ఇప్పటికే 550 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి వచ్చాయని, మరో 2,200 బస్సులను ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు.

ఫ్యూచర్ సిటీపై దృష్టి

హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు పెంచేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఆర్టీసీ, మెట్రో, ఆటో సేవలను సాంకేతికతతో అనుసంధానం చేసి సమగ్ర ప్రజా రవాణా వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్‌లు పట్నం మహేందర్‌రెడ్డి, అద్దంకి దయాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, టీజీఎస్ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, హైదరాబాద్ మెట్రో ప్రభుత్వ సలహాదారు ఎస్వీఎస్ రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి తదితరులు పాల్గొన్నారు.



జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

- టీడీఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెల్లి కిరణ్ కుమార్
- డిజిటల్ మీడియా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి
- టీడీఎంయూ రాష్ట్ర కార్యదర్శి పల్లెబోయిన నాగరాజు





అక్షరశక్తి, హన్మకొండ : జర్నలిస్టుల హక్కులు, భద్రత, సంక్షేమానికి సంబంధించిన దీర్ఘకాలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ డిజిటల్ మీడియా యూనియన్ అధ్యక్షుడు ఆరెల్లి కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సమాజంలో డిజిటల్ మీడియా హవా కొనసాగుతున్న ప్రస్తుత తరుణంలో మీడియా రంగానికి సంబంధించిన విధానపరమైన సిఫార్సులు చేసేందుకు ప్రత్యేకంగా కొత్త మీడియా కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.శుక్రవారం హన్మకొండలో జరిగిన యూనియన్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేక కేంద్ర చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు.ప్రింట్, ప్రసార, డిజిటల్ మీడియా ఉద్యోగులకు వర్తించేలా కొత్త వేతన బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం సంఘం కార్యదర్శి పల్లెబోయిన నాగరాజు మాట్లాడుతూ ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా అనే వ్యత్యాసాలు లేకుండా అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జర్నలిస్టులకు వైద్య సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో ప్రధాన జర్నలిస్టు సంఘాలు విఫలమయ్యాయని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. డిజిటల్ మీడియా జర్నలిస్టుల సమస్యలను కూడా పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం సమగ్ర విధానాన్ని రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ సలహాదారు రాజేశ్వరరావు, కోశాధికారి వంశీ, ఉపాధ్యక్షుడు మోహన్ రావు, సహాయ కార్యదర్శి నగేష్ గౌడ్, కార్యవర్గ సభ్యులు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఓరుగల్లు కీర్తిని ఇనుమడింప చేయాలి

- ఆసియా కప్ కు ఎంపికైన సాయి వర్షినికి ప్రత్యేక అభినందనలు
- తెలంగాణ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ పిల్లి సాంబశివరావు





అక్షరశక్తి, హనుమకొండ : ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని సాఫ్ట్ బాల్ క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణిస్తూ.. భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ.. దేశ, రాష్ట్ర, జిల్లా కీర్తిని ఇనుమడింప చేయాలని తెలంగాణ రాష్ట్ర సాఫ్ట్ బాల్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ పిల్లి సాంబశివరావు కోరారు. ఆసియా కప్ కు ఎంపికైన సాఫ్ట్ బాల్ క్రీడాకారిని సాయి వర్షినిని హనుమకొండ జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ...హనుమకొండ జిల్లా నుంచి భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించేలా ఆసియా కప్పు ఎంపికైన సాయి వర్షినికి ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నట్లు ప్రకటించారు. భారత జట్టుకు ఎంపికయ్యేలా శిక్షణను ఇచ్చేలా చర్యలు తీసుకున్న అసోసియేషన్ సెక్రటరీ తాబేటి రాజేందర్, ఇతర ప్రతినిధులు, జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో శిక్షణ ఇచ్చిన కోచ్ పోలిపాక వినయ్ కుమార్ సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. సాఫ్ట్ బాల్ అసోసియేషన్ సేవలను సద్వినియోగం చేసుకొని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించాలని ఆకాంక్షించారు.అంతకుముందు సెక్రటరీ తాబేటి రాజేందర్ మాట్లాడుతూ.. ఈనెల 12వ తేదీ నుంచి 18వ తేదీ వరకు చైనాలో జరిగే 5వ ఆసియా కప్ అండర్ 15 బాలికల విభాగం పోటీలో సాయి వర్షిని పాల్గొంటుందని తెలిపారు. అంతకుముందు ఈనెల ఆరో తేదీ నుంచి 10వ తేదీ వరకు పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని కళ్యాణ నదియా జిల్లాలో జరుగు ఫైనల్ క్యాంపులో శిక్షణ పొందనుందని తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఉపాధ్యక్షులు పెరుమాండ్ల సాంబమూర్తి మాట్లాడుతూ... చిన్నప్పటి నుంచే సాయి వర్షిని కి సాఫ్ట్ బాల్ క్రీడపై శిక్షణ ఇప్పించిన తల్లిదండ్రులను స్ఫూర్తిగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పిల్లలలో అంతర్లీనంగా ఉన్న శక్తులను గుర్తించి వారిని ఆ దిశలో ప్రోత్సహించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందన్నారు. అనంతరం కోచ్ పోలేపాక వినయ్ కుమార్ మాట్లాడుతూ.. మహా రాష్ట్రలో జరిగిన 39వ సబ్ జూనియర్ నేషనల్ సాఫ్ట్బా ల్ ఛాంపియన్షిప్ లో తెలంగాణ రాష్ట్ర జట్టు మూడవ స్థానం సాధించడంలో సాయి వర్షిని సభ్యురాలిగా క్రీడా ప్రతిభను ప్రదర్శించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ, ఫిజికల్ డైరెక్టర్ సుమలత, ఫిజికల్ డైరెక్టర్లు రాజు, కిరణ్మై, తల్లిదండ్రులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అదనంగా వసూలు చేసిన రూ.15.60 కోట్లు రీఫండ్ చేయాలి



అక్షరశక్తి,కరీంనగర్: ప్రతిమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (పిమ్స్) వైద్య కళాశాల యాజమాన్యం విద్యార్థుల నుంచి నిబంధనలకు విరుద్ధంగా వసూలు చేసిన అదనపు ఫీజులను వెంటనే తిరిగి చెల్లించాలని మెడికో పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లోజుల సత్యనారాయణ డిమాండ్ చేశారు. 2021 ఎంబీబీఎస్ బ్యాచ్‌కు సంబంధించి నాలుగున్నర సంవత్సరాలకు బదులుగా ఐదేళ్ల ఫీజు వసూలు చేశారని, 2021, 2022 సంవత్సరాల్లో తల్లిదండ్రుల నుంచి మొత్తం రూ.15.60 కోట్లు అదనంగా వసూలు చేసినట్లు ఆరోపించారు. అదనపు ఫీజులు వసూలు చేయవద్దని, వసూలు చేసిన మొత్తాన్ని తిరిగి చెల్లించాలని TAFRC ఆదేశించినప్పటికీ యాజమాన్యం స్పందించడం లేదని ఆయన విమర్శించారు. అదనపు ఫీజులపై ప్రశ్నించే విద్యార్థులను అటెండెన్స్ తగ్గిస్తామని, ప్రాక్టికల్స్‌లో ఫెయిల్ చేస్తామని బెదిరిస్తూ మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని సత్యనారాయణ ఆరోపించారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు న్యాయం జరిగేలా కళాశాల యాజమాన్యం వెంటనే చర్యలు తీసుకుని రీఫండ్‌పై అధికారిక ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే కేంద్ర హోంమంత్రి అమిత్ షా కళాశాల పర్యటన సందర్భంగా తల్లిదండ్రులతో కలిసి నిరసన చేపట్టి పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు.

ఆడబిడ్డల ఆత్మగౌరవానికి కల్యాణలక్ష్మి భరోసా



అక్షరశక్తి, హనుమకొండ, అక్టోబరు 2: పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు అప్పటి సీఎం కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి పథకానికి 12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో హనుమకొండ పద్మాక్షి జంక్షన్‌లో శుక్రవారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ పేద కుటుంబాల్లో ఆడపిల్ల వివాహం ఆర్థికంగా భారంగా మారుతున్న పరిస్థితుల్లో కల్యాణలక్ష్మి పథకం అండగా నిలిచిందన్నారు. ఇది కేవలం ఆర్థిక సాయం మాత్రమే కాకుండా పేదింటి ఆడబిడ్డ వివాహాన్ని ప్రభుత్వం బాధ్యతగా భావించిన సంక్షేమ దృక్పథానికి ప్రతీక అని పేర్కొన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఆసరా వంటి పథకాల ద్వారా పేద కుటుంబాలకు కేసీఆర్ ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. ప్రభుత్వాలు మారినా ప్రజలకు ప్రయోజనం చేకూర్చే సంక్షేమ పథకాల ప్రాధాన్యాన్ని విస్మరించకూడదని, ఆడబిడ్డల సంక్షేమ పథకాలను మరింత బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, మాజీ కార్పొరేటర్లు, మాజీ డివిజన్ అధ్యక్షులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

NHM ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి



హనుమకొండ, అక్టోబరు 2: తెలంగాణలో పనిచేస్తున్న 17 వేల మంది ఎన్‌హెచ్ఎం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ఎన్‌హెచ్ఎం జేఏసీ డిమాండ్ చేసింది. రెగ్యులరైజేషన్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఉద్యోగులకు 100 శాతం గ్రాస్ శాలరీ, ఉద్యోగ భద్రత, ఆరోగ్య భద్రత కల్పించాలని కోరింది. 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు, ఐదు శాతం వార్షిక ఇంక్రిమెంట్లు, ఎనిమిది శాతం లాయల్టీ బోనస్, పీఆర్సీ ప్రయోజనాలు అమలు చేయాలని డిమాండ్ చేసింది. ఎన్‌హెచ్ఎం జేఏసీ సమ్మెలో భాగంగా శుక్రవారం హనుమకొండలోని గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. డిమాండ్లు నెరవేరే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎన్‌హెచ్ఎం జేఏసీ అధ్యక్షుడు డాక్టర్ మహేందర్‌రావు పుట్ట, డీపీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుక్ముద్దీన్, డాక్టర్ హరికృష్ణ, కోశాధికారి నరేష్, వినోద్, కర్నల్, కుమారస్వామి, వినోద్ తదితర ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు పాల్గొన్నారు.


మహాత్మా గాంధీకి ఘన నివాళి



అక్షరశక్తి,హైదరాబాద్ : జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా లంగర్‌హౌస్‌లోని బాపూ ఘాట్‌లో రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. మహాత్ముడి విగ్రహానికి పుష్పాంజలి ఘటించి సర్వమత ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాపూ ఘాట్‌లో ఏర్పాటు చేసిన డిజిటల్ మ్యూజియంను గవర్నర్‌తో కలిసి ముఖ్యమంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, మహమ్మద్ అజారుద్దీన్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు గద్వాల విజయలక్ష్మి పాల్గొన్నారు. అలాగే, ప్రభుత్వ సలహాదారు వీ హనుమంత రావు, ప్రభుత్వ విప్‌లు అద్దంకి దయాకర్, రామచంద్ర నాయక్, ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

GUEST COLUMN

జ్ఞానేశ్ కుమార్ ఏక పక్ష నిర్ణయాలు
ఎన్నికల సంఘం విశ్వసనీయతకు పరీక్ష



- డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.
ramkishore.1504@gmail.com

ఎన్నికల్లో ఎవరు గెలిచారు, ఎవరు ఓడిపోయారు అనేది ప్రజాస్వామ్యంలో సహజం. కానీ ఎన్నికలను నిర్వహించే సంస్థపైనే ప్రజలకు అనుమానం మొదలైతే అది సాధారణ రాజకీయ వివాదంగా మిగలదు. ఇప్పుడు భారత ఎన్నికల సంఘం చుట్టూ ఏర్పడిన పరిస్థితి అలాంటిదే. ముఖ్యంగా ఇండియన్ ఎక్స్‌ప్రెస్ బయటపెట్టిన ఎన్నికల సంఘం అంతర్గత పత్రాలు ఈ చర్చను మరింత తీవ్రమైన సంస్థాగత ప్రశ్నగా మార్చాయి.

ఆ నివేదిక ప్రకారం ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషి గత పది నెలల్లో కనీసం 14 సందర్భాల్లో కీలక నిర్ణయాలపై అధికారికంగా అభ్యంతరాలు వ్యక్తం చేశారు. కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల పేర్ల తొలగింపు, తిరిగి చేర్పులు, ఫారం-6లో మార్పులు, ఓటర్ల డేటాబేస్‌ను కేంద్రీకరించడం, ఎన్నికల సాఫ్ట్‌వేర్‌పై నియంత్రణ వంటి అంశాలే ఈ అభ్యంతరాల కేంద్రంగా ఉన్నాయి. కొన్ని నిర్ణయాలు తమకు తెలియకుండానే తీసుకున్నాయని, కొన్ని చర్యలు అనధికారికమైనవని వారు పేర్కొన్నట్లు నివేదిక వెల్లడించింది.

ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతుంది. ఎన్నికల సంఘం అంటే ప్రధాన ఎన్నికల కమిషనర్ ఒక్కరేనా? లేక ముగ్గురు సభ్యులతో కూడిన రాజ్యాంగ సంస్థనా? రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ఎన్నికల నిర్వహణకు అధికారాన్ని ఎన్నికల సంఘానికి అప్పగిస్తుంది. 2023 చట్టంలోని సెక్షన్ 18 ప్రకారం కమిషన్ వ్యవహారాలు సాధ్యమైనంతవరకు ఏకగ్రీవంగా, విభేదం ఉంటే మెజారిటీతో నిర్వహించాలి. కమిషన్ తన పని విధానాన్ని, అధికార విభజనను కూడా ఏకగ్రీవంగా నిర్ణయించాల్సి ఉంటుంది. కాబట్టి సీఈసీ కమిషన్‌కు అధ్యక్షుడు అయినప్పటికీ, మొత్తం కమిషన్‌ను పక్కనపెట్టి వ్యక్తిగతంగా నిర్ణయాలు తీసుకునే అధికారం లేదు. అందుకే చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఏక పక్షంగా తీసుకున్న నిర్ణయాలే ఇప్పుడు కీలక న్యాయపరమైన ప్రశ్నగా మారింది.

ఇదే సందర్భంలో రాజకీయ విశ్లేషకుడు, మాజీ ఎన్నికల వ్యూహకర్త యోగేంద్ర యాదవ్ లేవనెత్తిన ప్రశ్న ప్రాధాన్యం సంతరించుకుంది. సమస్య జ్ఞానేశ్ కుమార్ వ్యక్తిగతంగా ఏ నిర్ణయం తీసుకున్నారన్నది మాత్రమే కాదు; ఎన్నికల సంఘం పేరుతో వెలువడిన నిర్ణయాలు నిజంగా కమిషన్‌లో చర్చించి, ఆమోదించి, నమోదు చేసినవేనా అన్నదే అసలు ప్రశ్న అని ఆయన వాదన. సెప్టెంబర్ 26న ఎన్నికల సంఘం భవిష్యత్తులో సమావేశాలకు ముందుగా అజెండా పంపి, అనంతరం మినిట్స్ నమోదు చేస్తామని ప్రకటించడం కూడా ఈ నేపథ్యంలో ముఖ్యమైంది. ఎందుకంటే గతంలో అజెండాలు, మినిట్స్, కమిషన్ ఆమోదం లేకుండానే కొన్ని ఉత్తర్వులు లేదా కమ్యూనికేషన్లు ఏక పక్షంగా వెలువడ్డాయనే అభిప్రాయాన్ని దృవపరిచినట్లు స్పష్టం అయింది. ఇదే విషయంలో ఇద్దరు కమిషనర్లు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నివేదించింది.

ఫారం-6 వివాదం దీనికి స్పష్టమైన ఉదాహరణ. కొత్త ఓటరుగా నమోదు కావడానికి ఉపయోగించే



ఫారం-6లో ఎస్ఐఆర్‌కు సంబంధించిన అదనపు ప్రకటనను చేర్చారు. దరఖాస్తుదారు లేదా అతని తల్లిదండ్రులు, తాతముత్తాతలు గత ఎస్ఐఆర్ ఓటర్ల జాబితాలో ఉన్నారా అనే వివరాలను అడిగే విధంగా ఈ మార్పు జరిగింది. ఈ మార్పుకు చట్టపరమైన అనుమతి అవసరమని, రాజ్యాంగ ఉల్లంఘనగా వారు తమ అభ్యంతరాలు లిఖిత రూపంలో తెలిపినా వారికి తెలియకుండానే ఈమార్పులు జరిగాయని సంధూ, జోషి పేర్కొన్నట్లు నివేదిక చెబుతోంది.

ఇక్కడ మొదటిసారి ఓటు వేయబోయే జన్-జీ యువత సమస్యను కూడా చూడాలి. 18 ఏళ్ల యువకుడికి తన తాత పేరు దశాబ్దాల క్రితం ఏ ఓటర్ల జాబితాలో ఉందో తెలియకపోవచ్చు. ఓటు హక్కును నిర్ధారించే ప్రక్రియ సరళంగా, సాంకేతికంగా అందుబాటులో ఉండాలి. పత్రాలు, పాత జాబితాల ఆధారాల భారంతో కొత్త ఓటరు నమోదు కష్టమైతే ప్రజాస్వామ్యంపై యువతకు నమ్మకం పెరగదు.

ఎస్ఐఆర్‌పై ప్రతిపక్షాలు లేవనెత్తిన ప్రశ్నలు కూడా ఈ సందర్భంలో ప్రాధాన్యం పొందాయి. రాహుల్ గాంధీ వివిధ రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాల్లో అసాధారణ మార్పులు, నమోదులు, తొలగింపులపై డేటా ఆధారిత ప్రశ్నలు లేవనెత్తారు. పరకాల ప్రభాకర్ కూడా పోలింగ్ సమయాలు, ఓటింగ్ శాతాల్లో కనిపించిన మార్పులపై గణాంకపరమైన సందేహాలు అనేక ఉదాహరణలతో వ్యక్తం చేశారు. అయితే ఇప్పుడు ఎన్నికల సంఘం లోపల నుంచే ఓటర్ల నమోదు, తొలగింపు, డేటాబేస్ నియంత్రణపై అభ్యంతరాలు వెలువడటం వల్ల ఈ ప్రశ్నలకు మరింత బలం చేకూరింది.

మమతా బెనర్జీ సహా పలువురు ప్రతిపక్ష నేతలు ఎస్ఐఆర్‌ను తీవ్రంగా వ్యతిరేకించారు. చెల్లుబాటు అయ్యే ఓటర్ల పేర్లు తొలగించబడుతున్నాయని వారు ఆరోపించారు. మరోవైపు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఎస్ఐఆర్ కు సంబంధించిన నిర్ణయాలు ఏకగ్రీవంగా తీసుకున్నామని చెప్పిన మాటల్లో నిజమెంతో సుప్రీంకోర్టు విచారణ లో తేలాలి, కాబట్టి ఇది కేవలం 'ప్రతిపక్షం వర్సెస్ ఎన్నికల సంఘం' అనే వివాదంగా కాకుండా, ప్రజలకు ఎన్నికల ప్రక్రియపై నమ్మకం ఎలా కల్పించాలన్న ప్రశ్నగా చూడాలి.

మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎస్.వై. ఖురేషీ తదితరులు కూడా ఈ పరిణామాలను సాధారణ అంతర్గత విభేదంగా చూడకూడదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఎందుకంటే విభేదాలు ఎన్నికల సంఘం మౌలిక బాధ్యతలైన ఓటర్ల నమోదు, తొలగింపు, ఫారం-6, డిజిటల్ ఓటర్ల వ్యవస్థ వంటి అంశాలపైనే వచ్చాయి. అందువల్ల అసలు ప్రశ్న 'ఎస్ఐఆర్ మంచిదా, చెడ్డదా?' అనే దానికంటే నిర్ణయాలు నిజంగా ఎన్నికల సంఘం సమిష్టిగా తీసుకున్నవేనా అన్నదే ప్రధాన ప్రశ్న.

సాఫ్ట్‌వేర్ అంశం మరింత సున్నితమైనది. ఓటర్ల జాబితా తయారీ, మార్పులు, తొలగింపుల్లో నియోజకవర్గ స్థాయి ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు చట్టబద్ధమైన పాత్ర పోషిస్తారు. అయితే వారి ప్రాప్యతను కేంద్రీకృత సాఫ్ట్‌వేర్ పరిమితం చేస్తే, సాంకేతిక వ్యవస్థే ఒక కొత్త అధికార కేంద్రంగా మారింది. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రకారం గోవాలో అర్హులుగా గుర్తించిన 97 మంది ఓటర్లను తుది జాబితాలో చేర్చే నిర్ణయాన్ని సాఫ్ట్‌వేర్ లో ఆప్షన్ లేని కారణంగా నమోదు చేయలేకపోయారు. ఇది సంఖ్యాపరంగా చిన్నదిగా కనిపించినా, చట్టబద్ధమైన అధికారి నిర్ణయాన్ని డిల్లీ లోని కేంద్రీకృత మైన సాంకేతిక వ్యవస్థ అడ్డుకోవడం వల్ల అమలు చేయలేకపోవడం పెద్ద సంస్థాగత ప్రశ్న.

ఎస్ఐఆర్ ద్వారా కోట్లాది పేర్లపై పరిశీలన జరుగుతున్నప్పుడు పారదర్శకత, అప్పీల్, పునఃపరిశీలన వ్యవస్థలు మరింత బలంగా ఉండాలి. ఓటర్ల జాబితా శుద్ధీకరణ అవసరం కావచ్చు. కానీ నకిలీ ఓటరును తొలగించే క్రమంలో నిజమైన ఓటరు పేరు తొలగిపోకుండా రక్షణ ఉండాలి. ప్రతి ఓటరుకు తన పేరు ఎందుకు తొలగించబడిందో తెలుసుకునే హక్కు, దాన్ని సరిచేసుకునే అవకాశం ఉండాలి.

ఎన్నికల సంఘం సెప్టెంబర్ 26న కొన్ని చర్యలను ప్రకటించింది. ఎస్ఐఆర్‌కు సంబంధించిన నిర్ణయాలు ఏకగ్రీవమని స్పష్టం చేయడంతో పాటు, ఈసీఐనెట్ సాఫ్ట్‌వేర్‌ను నిపుణుల కమిటీతో సమీక్షించడం, భవిష్యత్తులో ఐటీ మార్పులను కమిషన్ ఆమోదానికి ముందు పరిశీలించడం వంటి చర్యలను ప్రకటించింది. అయితే గతంలో తీసుకున్న కీలక నిర్ణయాలకు సంబంధించిన అజెండాలు, మినిట్స్, ఆమోద ప్రక్రియను కూడా ప్రజల ముందుంచితేనే పారదర్శకతపై సందేహాలు తగ్గుతాయి.

ఇదే సమయంలో జ్ఞానేశ్ కుమార్ వ్యవహారశైలి, ఎస్ఐఆర్ చట్టబద్ధతపై దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు పరిశీలించేందుకు అంగీకరించింది. పిటిషన్‌లో ప్రధానంగా లేవనెత్తిన ప్రశ్న — రాజ్యాంగం అధికారాన్ని 'చీఫ్ ఎలక్షన్ కమిషనర్' అనే వ్యక్తి ఏక పక్షంగా ఇచ్చిందా?, లేక 'ఎలక్షన్ కమిషన్ మెజారిటీ' నిర్ణయమా? అన్నది తేలాలి. దీనిపై తుది న్యాయపరమైన అభిప్రాయం సుప్రీంకోర్టుదే.

అందువల్ల ఇప్పుడు దేశం ముందు ఉన్న ప్రశ్న 'జ్ఞానేశ్ కుమార్‌కు తీసుకున్న నిర్ణయాలు స్వయంగా తీసుకున్నారా? దాని వెనుక ఇంకా ఎవరైనా వత్తిడి చేశారా? అన్నది తేలాలి. ఎన్నికల సంఘంలో ఎందుకు ఇంత అస్పష్టత? నిర్ణయాలకు పూర్తి రికార్డు ఎందుకు లేదు? ఓటర్ల డేటాబేస్‌పై అధికార పరిధి ఎవరిది? ఇద్దరు కమిషనర్లు పదేపదే అభ్యంతరం వ్యక్తం చేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు రావాలి.

ఎన్నికల ఫలితం కంటే ముందు ఎన్నికల ప్రక్రియపై నమ్మకం ఉండాలి. ఓటు ఎవరికి పడిందన్నది తర్వాతి విషయం. ఓటు వేయగల హక్కు ఉన్న వ్యక్తి పేరు జాబితాలో ఉందా?, ఎందుకు తొలగించారు?, ఆ నిర్ణయం ఎవరు తీసుకున్నారు?, దాన్ని సరిదిద్దుకునే అవకాశం ఉందా !?— ఇవే ప్రజాస్వామ్యానికి పునాది.

అందుకే ఇప్పుడు కావాల్సింది రాజకీయ నినాదాల కంటే సంస్థాగత పారదర్శకత. ఎన్నికల సంఘం అంతర్గత నిర్ణయాల పూర్తి రికార్డు, ఫారం-6 మార్పులపై స్పష్టమైన వివరణ, ఎస్ఐఆర్‌లో తొలగించిన పేర్లపై స్వతంత్ర ఆడిట్, ఓటర్ల డేటాబేస్‌పై సాంకేతిక పరిశీలన, ప్రతి ఓటరుకు సమర్థవంతమైన అప్పీల్ హక్కు అవసరం.

ఈ పరీక్షలో ఎవరు గెలుస్తారన్నది ముఖ్యం కాదు. భారత ఓటరు తన ఓటు హక్కుపై నమ్మకాన్ని కోల్పోకుండా ఉండటం, ఎన్నికల సంఘంపై విశ్వాసం నిలబడటం — అదే అసలు ప్రజాస్వామ్య విజయం.

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.

అక్షరశక్తి Evening Daily
7
శుక్రవారం, 02 అక్టోబర్ 2026
Telugu Trending News

తలొంచి కాదు.. ఎదిరించి నిలిచిన!

"తలొంచుకొని బతకలేదు.. ఎదురించి బతికిన. నిరంతర సంఘర్షణ నుంచి వచ్చినవాడిని. నా ఆత్మగౌరవాన్ని ఎప్పుడూ తాకట్టు పెట్టలేదు. ఆత్మాభిమానాన్ని చంపుకొని అవకాశాల కోసం పాకులాడలేదు. అణిచివేతలను, అసమానతలను ధైర్యంగా ఎదిరించి ప్రశ్నించడం వల్లే సమాజంలో ప్రజా నాయకుడిగా గుర్తింపు పొందాను. ఉద్యమానికి కరదీపికలా పనికొచ్చిన నాలాంటి వాళ్లం.. స్వరాష్ట్రం సిద్ధించాక అధికారంలో భాగస్వామ్యానికి పనికిరాలేదా? తొమ్మిదేళ్ల పాలనలో ఉద్యమకారుల బతుకులు అంధకారమయ్యాయి. అందుకే మలిదశ ఉద్యమానికి నడుం బిగించాం" అని స్పష్టం చేశారు ప్రముఖ న్యాయవాది, తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక రాష్ట్ర చైర్మన్ గుడిమళ్ల రవికుమార్. తెలంగాణ డిజిటల్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన ప్రత్యేక చిట్‌చాట్‌లో ఆయన తన బాల్యం, విద్యార్థి దశ, న్యాయవాద ప్రస్థానం, ఉద్యమ అనుభవాలు మరియు సమకాలీన రాజకీయాలపై మనసు విప్పి మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

- అక్షరశక్తి, వరంగల్ ప్రతినిధి



పోరాటాల గడ్డపై జననం.. సమాజమే నా పాఠశాల

మాది వరంగల్. నేను పుట్టింది వరంగల్‌లోనే అయినా, పెరిగింది మాత్రం రంగంపేటలో. అమ్మానాన్నలు గుడిమళ్ల పుష్పలీల - రాఘవేందర్‌రావులది ఆదర్శ కులాంతర ప్రేమవివాహం. అమ్మ ఎంజీఎంలో నర్సుగా బాధ్యతలు నిర్వర్తిస్తే, నాన్న ఫార్మసిస్ట్‌గా పనిచేశారు. సమాజంలో తీవ్ర వివక్షకు గురైన దళిత, బడుగు బలహీన వర్గాల మధ్య పెరిగాను. వరంగల్‌లో చదివి, ఎస్వీ యూనివర్సిటీలో ఎల్ఎల్‌బీ పూర్తి చేశాను. చిన్నతనం నుంచే సామాజిక స్పృహ మెండుగా ఉండేది. 1982లో దాదాపు 120 మంది మిత్రులతో కలిసి 'మూన్‌లైట్ యూత్' ఏర్పాటు చేసి వ్యాయామశాల నడిపాం. ఆ తర్వాత 1994లో 'నవచైతన్య అసోసియేషన్' పేరిట యువత ఆధ్వర్యంలో కమ్యూనిటీ హాల్ నిర్మించాం; అప్పటి కలెక్టర్ శాలినీ మిశ్రా దానిని ప్రారంభించారు. మహిళా పాలిటెక్నిక్ విద్యార్థినులకు ఎలాంటి ఆకతాయిల వేధింపులు లేకుండా రక్షణగా నిలవడం, వరదలు వచ్చినప్పుడు సహాయక చర్యల్లో పాల్గొనడం వంటి సామాజిక సేవలు అందించాం.

నెత్తురోడిన నేలను చూసి రగిలిన గుండె

1980–2000 కాలంలో ఉమ్మడి వరంగల్ జిల్లా నక్సలైట్ ప్రాబల్య ప్రాంతంగా ఉండేది. ఎక్కడ చూసినా రక్తపాతమే. నిత్యం ఎన్‌కౌంటర్లు, మందుపాతరల పేలుళ్లు, అమాయకుల మరణాలు నా హృదయాన్ని తీవ్రంగా కలచివేశాయి. ఈ నెత్తుటి ధారలకు ప్రధాన కారణం తెలంగాణ తీవ్ర వెనుకబాటుతనమేనని బలంగా గ్రహించాను. ఈ రక్తసిక్త తెలంగాణ శాంతియుత, ప్రజా తెలంగాణగా మారాలంటే ప్రత్యేక రాష్ట్ర సాధన ఒక్కటే మార్గమని నమ్మాను. రాష్ట్ర ఆవశ్యకతను లోతుగా అధ్యయనం చేయడానికి 1988–90 నుంచే ప్రయత్నించాను. ఆ క్రమంలోనే రామన్నపేటలోని ఆర్యవైశ్య సత్రంలో జరిగిన 'తెలంగాణ ప్రజా సమితి' సదస్సుకు హాజరయ్యాను. నా అదృష్టం కొద్దీ ఉద్యమ ప్రస్థానంలో ప్రొఫెసర్ జయశంకర్ సార్, ప్రజాకవి కాళోజీ నారాయణరావు, గాంధేయవాది భూపతి కృష్ణమూర్తి, ఆచార్య బి. జనార్ధన్ రావు, ఆచార్య కూరపాటి వెంకటనారాయణ వంటి మహామహులతో కలిసి ఉద్యమ వేదికలను పంచుకునే అరుదైన గౌరవం దక్కింది.

కుట్రలతో నన్ను అధికారానికి దూరం చేశారు

పార్టీ కోసం అన్నీ ధారపోసిన నాకు వరంగల్ ఎంపీ టికెట్ దాదాపు ఖరారైంది. నాకున్న చట్ట పరిజ్ఞానం, వాగ్ధాటి, భాషా నైపుణ్యం ఢిల్లీ వేదికగా ఉపయోగపడుతుందని కేసీఆర్ భావించారు. అయితే, బీఆర్ఎస్‌లోని కొంతమంది కుహనా ఉద్యమకారులు నా ప్రతిభ (Caliber), సామర్థ్యం (Capability), నిబద్ధత (Conviction), ఆత్మవిశ్వాసం (Confidence), నాయకత్వ లక్షణాలను (Leadership) చూసి ఉలిక్కిపడ్డారు. గుడిమళ్ల రవికుమార్ గెలిచి వస్తే తమ రాజకీయ మనుగడకే ప్రమాదమని భయపడి, కేసీఆర్‌కు తప్పుడు నివేదికలు ఇచ్చి తీవ్ర కుట్రలు పన్ని చివరకు టికెట్ రాకుండా అడ్డుకున్నారు. ఉద్యమానికి కరదీపికలా పనికొచ్చిన నన్ను ప్రభుత్వ పాలనలో భాగస్వామ్యానికి పనికిరాకుండా చేశారు. గడచిన తొమ్మిదేళ్ల పాలనలో పార్టీ నుంచి నాకు దక్కింది ఒక్క పైసా లేదు. చేసిపెట్టిన ఒక్క పని లేదు. నన్ను నమ్మి, నా ప్రేరణతో పార్టీలోకి వచ్చిన వందలాది మంది కార్యకర్తలు తీవ్ర నిరాశ, నిస్పృహలకు గురయ్యారు. తెలంగాణ కోసం సర్వస్వం త్యాగం చేసిన మేము, చివరకు మా మలి అస్తిత్వం కోసం మళ్లీ పోరాడాల్సి వస్తుందని కలలో కూడా అనుకోలేదు.

కోర్టులో కుల వివక్షపై తిరుగుబాటు

1995లో న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించినప్పుడు కోర్టు సముదాయంలో తీవ్రమైన వర్గ పోరాటంతో (Class Struggle) పాటు కుల వివక్షను (Caste Struggle) సైతం ఎదుర్కొన్నాను. వకాలత్ అనేది కొద్దిమంది ఆధిపత్య వర్గాల గుప్పిట్లోనే బందీగా ఉండేది. కానీ నేను ఎక్కడా తలదించలేదు. చట్టాలపై పూర్తి పట్టు, ఆంగ్ల-హిందీ భాషా నైపుణ్యం ఉండడం వల్ల నాకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాను. 'మెజీషియన్ రవికుమార్' కాస్తా 'అడ్వకేట్ గుడిమళ్ల రవికుమార్'గా గుర్తింపు పొందారు. క్రాస్ ఎగ్జామినేషన్‌లో తిరుగులేని వాదనలతో 99.9 శాతం కేసులు గెలిచాను. వందలాది మంది పేదలకు, ఉద్యమకారులకు పైసా తీసుకోకుండా ఉచితంగా వాదించాను. 1998లో 'యువ న్యాయవాదుల సంఘం' ఏర్పాటు చేసి వారిలో వృత్తి నేపుణ్యాన్ని పెంపొందించే సభలు, సమావేశాలు, సెమినర్స్ నిర్వహించం.

ఉద్యమకారుల ఓదార్పు యాత్ర..

తెలంగాణ సాధన కోసం ప్రాణాలను, భవిష్యత్తును త్యాగం చేసిన ఉద్యమకారుల కుటుంబాలు నేడు వీధిన పడ్డాయి. అందుకే 'తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక' ఆధ్వర్యంలో రంగంలోకి దిగాం. 2026 సెప్టెంబర్ 17న వరంగల్ నగరంలో తొలిదశ ఉద్యమ అమరవీరుల స్తూపం సాక్షిగా ఉద్యమకారుల మొదటి విడత 'ఓదార్పు యాత్ర' ప్రారంభించాను. 4 రోజుల పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సాగిన ఈ యాత్రలో 126 మంది ఉద్యమకారుల కుటుంబాలను స్వయంగా కలిసి వారి స్థితిగతులను అధ్యయనం చేశాం. ఆ పర్యటనలో నన్ను కలచివేసిన చేదు నిజం ఏమిటంటే... మేము కలిసిన ఆ 126 కుటుంబాలలో ఒక్క కుటుంబం ముఖంలో కూడా 'తెలంగాణ వచ్చింది' అన్న ఇసుమంత సంతోషం కనిపించలేదు. రక్తమోడ్చి స్వరాష్ట్రాన్ని సాధించిన ఉద్యమకారులు ఇంతటి దుర్భర దారిద్ర్యంలో, తీవ్ర నిరాశలో జీవించడం స్వరాష్ట్రానికే తీరని దౌర్భాగ్యం.



జలదృశ్యంలో తొలి న్యాయవాదిని..

1998-99 ప్రాంతంలో కొత్త పార్టీ అవసరాన్ని జయశంకర్ సార్ వద్ద ప్రస్తావించినప్పుడు, కేసీఆర్ కూడా ఉద్యమబాట పడుతున్నారని సార్ చెప్పారు. అలా 2001లో కేసీఆర్ నేతృత్వంలో పార్టీ ఆవిర్భవించిన నాడు, హైదరాబాద్ జలదృశ్యంలో ఏడుగురు లాయర్లతో కలిసి గులాబీ కండువా కప్పుకున్న మొట్టమొదటి న్యాయవాదిని నేనే. పార్టీలో నన్ను ఒక స్టాక్ లీడర్‌గా వినియోగించుకున్నారు. ఎక్కడ అత్యవసరమైనా నన్ను పిలిచేవారు. ఉద్యమ సమయంలో కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావులతో పాటు ఎందరో ముఖ్య నేతలపై నమోదైన కేసులను నయాపైసా తీసుకోకుండా వాదించి బెయిళ్లు ఇప్పించాను. కేసీఆర్ స్వయంగా వరంగల్ కోర్టుకు వచ్చినప్పుడు పూర్తి బాధ్యత నాపైనే ఉంచారు.



మ్యాజిక్ షోలే నా టర్నింగ్ పాయింట్

మెజీషియన్ ఉమాపతి వద్ద మేజిక్ నేర్చుకున్నాను. వందలాది ప్రదర్శనలు ఇచ్చాను. అది నా జీవితానికే పెద్ద టర్నింగ్ పాయింట్. పది మంది ముందుకు వచ్చి ప్రదర్శన ఇవ్వడం వల్ల నాలో బిడియం, భయం పూర్తిగా పోయాయి. సమాజంలోని విభిన్న వర్గాల మనస్తత్వాలు, సమస్యలపై సమగ్ర అవగాహన ఏర్పడింది. ధైర్యంగా మైకు పట్టి గళమెత్తే వాగ్ధాటి, నాయకత్వ లక్షణాలు అలవడ్డాయి. మండల్ కమిషన్ పోరాటాల్లోనూ చురుగ్గా పాల్గొన్నాను.

పల్లెపల్లెనా తిరిగిన...

యువజన విభాగం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా రాత్రింబవళ్ళు పనిచేశాను. పల్లెపల్లెనా పార్టీ జెండాలు పాతాను, గద్దెలు కట్టించాను. ఉమ్మడి జిల్లాలోని సుమారు 50 వేల మంది ఆటోడ్రైవర్లను 'తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్' కింద ఏకం చేసి ఉద్యమంలోకి నడిపించాను. పూల వర్తకులను ఐక్యం చేశాను. స్వరాష్ట్రం సిద్ధించాక టీఆర్ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేసే ప్రతిపాదన వచ్చినప్పుడు, కేసీఆర్ సమక్షంలోనే ఆ ఆలోచనను తీవ్రంగా వ్యతిరేకించిన వారిలో నేను ముందున్నాను.

వరంగల్ ఆత్మను చంపేశారు

తెలంగాణ ఉద్యమాల్లో గర్జించిన చారిత్రక ఓరుగల్లు గడ్డ స్వరాష్ట్రంలో అన్ని రంగాల్లోనూ దారుణంగా వెనుకబడిపోయింది. హైదరాబాద్ తర్వాత రెండో రాజధాని కేవలం మాటలకే పరిమితమైంది. కొందరు స్వార్థపరుల రియల్ ఎస్టేట్, ఆర్థిక ప్రయోజనాల కోసం జిల్లాను విచక్షణారహితంగా ముక్కలు చేశారు. ఇక్కడి ప్రజాప్రతినిధులు జిల్లా అభివృద్ధికి నిధులు రాబట్టడంలో పూర్తిగా విఫలమయ్యారు. అధిష్టానం వద్ద మోకరిల్లడంలో, కాళ్ళు మొక్కడంలోనే పోటీపడ్డారు తప్ప ప్రజల



గొంతుకగా నిలవలేదు. వరంగల్ తన సహజ పోరాట పటిమను, ప్రశ్నించే తత్వాన్ని కోల్పోయేలా పాలకులు దెబ్బతీశారు.

మా పోరాటం ఆగదు.

ఉద్యమకారుల హక్కుల సాధన కోసం మా పోరాటం ఆగదు. ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల నివాస స్థలం, రూ.10 వేల కోట్లతో సంక్షేమ కార్పొరేషన్, బాధిత కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పించే వరకు ఐక్యవేదిక పక్షాన గళమెత్తుతూనే ఉంటాం. తలొంచే ప్రసక్తే లేదు.. తెలంగాణ ఆకాంక్షలు నిజమయ్యే వరకు ప్రశ్నిస్తూనే ఉంటాం..

- ఉద్యమానికి కరదీపికనైన నేను.. అధికారంలో భాగస్వామ్యానికి పనికిరానా?
- మ్యాజిక్ షోలే నాలో బిడియాన్ని పోగొట్టి ప్రజాక్షేత్రంలో నిలబెట్టాయి
- కోర్టులో నాడు కుల వివక్షను ఎదిరించా.. న్యాయవాదిగా పేదల పక్షాన నిలిచా..
- కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు ఉద్యమ కేసులను పైసా తీసుకోకుండా వాదించా
- పార్టీ ఆవిర్భావ దినాన టీఆర్ఎస్‌లో చేరిన మొట్టమొదటి న్యాయవాదిని నేనే..
- నా నాయకత్వ పటిమను చూసి ఓర్వలేక.. కుట్రలతో నన్ను అధికారానికి దూరం చేశారు
- 9పల్ల పాలనలో నాకు దక్కింది శూన్యం.. నమ్ముకున్న ఉద్యమకారులకు ద్రోహం
- వరంగల్ జిల్లా చారిత్రక అస్తిత్వాన్ని, పోరాట పటిమను దెబ్బతీశారు
- ఓదార్పు యాత్రలో తెలిసిన చేదు నిజం.. ఉద్యమకారుల కుటుంబాల్లో ఏమాత్రం సంతోషం లేదు!
- తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక రాష్ట్ర చైర్మన్, ప్రముఖ న్యాయవాది గుడిమళ్ల రవికుమార్
- తెలంగాణ డిజిటల్ మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్